



ఆమనగల్లు: దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి కుటుంబం



కొత్తూర్ : దీపాలను వెలిగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్



కేశంపేటలో...



షాద్‌నగర్‌లో..



షాద్‌నగర్‌లో చిన్నారి..



మైసిగండిలో దీపావళి వేడుకలు..



షాబాద్‌లో...

దీపావళి.. ఆనందాల కేళి

అంబురాన్నంటిన పండుగ సంబురాలు

ఇంటింటా విరజిమ్మిన దీపాల వెలుగులు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు, వ్రతాలు

బాణాసంచా పేల్చిన చిన్నాపెద్ద

దీపావళి సంబురాలు ఊరువాడా అంబురాన్నంటాయి. వెలుగు జిలుగుల పండుగను అన్ని గ్రామాలలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. తమ జీవితాలలో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు నిండాలని వేడుకుంటూ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని రకరకాల పూలతో ఇళ్లను శోభాయమానంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం, మంగళవారం నోములు, వ్రతాలు ఆచరించారు. ఇంటింటా దీపాలు వెలిగించి చిన్న, పెద్ద తేడా లేకుండా బాణాసంచా కాల్చారు. పండుగ సందర్భంగా ప్రతీ ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి.

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 21



25న ముగియనున్న రైజింగ్-2047 సర్వే

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వే ఈ నెల 25న ముగియనున్నదని, ఇందులో అందరూ పాల్గొనాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పన కోసం చేపట్టిన ఈ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఆయన చెప్పారు. ఈ సిటిజన్ సర్వేలో పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారన్నారు. దేశ స్వాతంత్ర్యానికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి తగు సలహాలు, సూచనలు అందజేయడానికి ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు.

టెన్త్ పరీక్షల పాత జవాబు పత్రాలు వేలం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి పదవ తరగతి మార్చి 2024, అడ్వాన్స్ సప్లిమెంటరీ జూన్ 2024 ప్రభుత్వ పరీక్షల మూల్యాంకన జవాబు పత్రాలు వేలం వేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు తెలిపారు. వేలంలో పాల్గొన దలిచిన రద్దీ వ్యాపారులు డీఈవో రంగారెడ్డి జిల్లా పేరున పది వేల రూపాయల డీడీ తీసి వారి రేట్ల వివరాలతో సీల్డ్ కొటేషన్‌ను కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో నేటి (బుధవారం) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల లోపు సమర్పించాలని ఆయన కోరారు. ఈ రోజు సాయంత్రం 4 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తామని ఆయన చెప్పారు.

ఎట్టకేలకు..!

పదేళ్లకు రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు

సన్న, చిన్నకారు రైతులకు కేంద్రం తీపి కబురు చెప్పింది. స్మామ్ పథకం ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలని నిర్ణయించింది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అందజేసినా.. పదేళ్లుగా బ్రేక్ పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ వ్యవసాయ పరికరాలపై రైతులకు రాయితీ దక్కలేదు. అయితే ఎట్టకేలకు ఇపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలని నిర్ణయించాయి.ఇందుకోసం జిల్లాకు రూ. 3.71 కోట్ల నిధులు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,313మంది రైతులకు వ్యవసాయ పరికరాలు రాయితీపై అందించనున్నారు. రాయితీ మొత్తంలో 40శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం, 60శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తున్నాయి.

స్మామ్ పథకాన్ని అమల్లోకి తెచ్చిన కేంద్రం

రాయితీలో 40శాతం రాష్ట్రం వాటా, కేంద్రానిది 60 శాతం

జిల్లాకు రూ.3.71కోట్లు కేటాయింపు

రాయితీపై 4,313 వ్యవసాయ యంత్రాలు అందుబాటులో..

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): వ్యవసాయ రంగంలో ఆధునికతే పైచేయిగా మారింది. పెట్టుబడులను తగ్గించుకుని, దిగుబడులు పెంచుకునేందుకు రైతాంగం అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుంటోంది. కూలీలు దొరకకపోవడం, దొరికినా కూలీ రేట్లు అధికంగా ఉండడంతో రైతుకు ఇబ్బందులు పెరుగుతున్నాయి. దీంతో వారు ఖర్చులు తగ్గించుకునేందుకు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే యంత్ర పరికరాల ధరలు బహిరంగ మార్కెట్‌లో రైతులకు అందుబాటులో దొరకడం గగనంగా మారింది. వ్యవసాయ యంత్రాలు, పరికరాల ధరలు అధికంగా ఉండడంతో చిన్న సన్నకారు రైతులు వీటిని కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. గతంలో కేంద్ర,

మిగతా 8వ పేజీలో...



అర్హులు ఎవరు?

వ్యవసాయ పరికరాల రాయితీకి రైతులంతా అర్హులే. పట్టా భూమి ఉన్న ప్రతీ ఒక్క రైతు రాయితీ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రాయితీ యంత్రాలు, పనిముట్లు కావాలనుకునే రైతులు సమీప వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి అక్కడ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జీరాక్స్ పత్రాలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత చేసి సమీప వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందచేయాలి. ట్రాక్టర్ అనుబంధ పరికరాలు కావాల్సిన వారు ఆర్‌సీ జీరాక్స్ కూడా జతచేయాలి. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ అధికారులు కంప్యూటరీకరించి అర్హులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారుల ఎంపికకు తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. లక్ష రూపాయల లోపు పరికరాలకు ఏడీఏ, రూ.లక్షపై బడిన వారికి డీఏఓ ప్రొసీడింగ్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

సబ్సిడీ ఇలా...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందిస్తున్నాయి. రాయితీ మొత్తంలో 40శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం, 60శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తున్నాయి. ఈ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 50శాతం రాయితీ అందిస్తున్నారు. అలాగే ఇతర రైతులకు 40శాతం రాయితీతో పరికరాలను పంపిణీ చేస్తారు.



పోలీస్ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, ఆక్టోపస్ ఎస్పీ శంకర్‌నాయక్

పోలీస్ అమర వీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల కుటుంబాలకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని మూడవ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని మూడవ బెటాలియన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. తీవ్రవాదమనేది ఏ రూపంలో ఉన్నా తుదముట్టించేందుకు పోలీస్ శాఖ సమర్థవంతంగా పని చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ ఎస్పీ శంకర్‌నాయక్, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.పాండుతో పాటు బెటాలియన్, ఆక్టోపస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 6వ వార్డులో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేస్తున్నట్టు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీలో కావాల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతోపాటు విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. గతంలో ఎన్నడూ చేపట్టని విధంగా అన్ని వార్డులో అభివృద్ధి కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ లతాశ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నాయకులు కె.చెన్నయ్య, ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, అగ్గనూరి బస్వం, రమేష్ పాల్గొన్నారు.



మట్టిలో కొట్టుకపోయిన పత్తి చేను

పొలాల్లో ఇసుక మేటలు!

అధిక వర్షాలతో తీవ్ర నష్టం

మట్టికొట్టుకుపోయిన పత్తి పంట

పాడైన కూరగాయల తోటలు

దిగుబడిపై రైతుల ఆందోళన

కొందుర్గు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు పత్తి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. లక్షల రూపాయలు అప్పు తీసుకువచ్చి పంటలు సాగు చేస్తే అధిక వర్షాలు, వరదలు పచ్చని పంట పొలాలను ఇసుక మేటలు కప్పేశాయి. కొన్నిచోట్ల వరద నీటికి వేళ్లతో సహా పెకిలిపోయాయి. ఇక కూరగాయలు సాగు

మిగతా 8వ పేజీలో...

కర్షకుల కళ్లలో కన్నీళ్లు

14 ఎకరాల పత్తికి నష్టం



పత్తి పంటను 14 ఎకరాలలో సాగు చేశాను. ఇప్పటికే రెండు మూడు దఫాలు మందులు పిచికారీ చేశాను. అడుగు మందులు సైతం వేశాను. పంట కోసం లక్షల రూపాయలు అప్పు చేశా. అధిక వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. అధికారులు పంటకు జరిగిన నష్టం అంచనా వేసి పరిహారం అందించాలి.

- ప్రశాంత్‌రెడ్డి, రైతు, లాలాపేట్

గవర్నర్‌ను కలిసిన ఆచారి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంగళవారం జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సత్కరించి అభినందించారు. పలు విషయాలపై చర్చించినట్లు ఆచారి తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 31న తన కుమారుడు తల్లోజు భరత్ నిశ్చితార్థ వేడుకలకు రావాలని గవర్నర్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సన్మానిస్తున్న ఆచారి

జాపాలలో సదర్ సందడి

మంచాల మండల పరిధి జాపాలలో సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం మల్లికార్జున యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సదర్‌లో నగరం నుంచి ప్రత్యేకంగా దున్నను తీసుకువచ్చి ముస్తాబు చేశారు. డీజే వాయిద్యాలతో దానిని గ్రామంలో ఊరేగిస్తూ సందడి చేశారు. ఈ వేడుకలో యువతీయువకులు పాల్గొని నృత్యాలు చేశారు.

మంచాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి)



సదర్ సమ్మేళనంలో దున్నపోతుల విన్యాసాలు

నాలుగు రోజులు రైల్వే గేట్ బంద్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని కేశంపేట రోడ్డు రైల్వే గేటును మరమ్మత్తుల కోసం మంగళవారం మూసివేశారు. ఈనెల 24వ తేదీ వరకు గేటును తాత్కాలికంగా బంద్ చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ పట్టణానికి వచ్చిపోవాలంటే ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం, సోలిపూర్, చిల్కమర్రి, గంట్లవెల్లి, మధురాపురం, శేరిగూడెం గ్రామాలతో పాటు కేశంపేట, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలైన కొత్తపేట రైల్వే గేటు నుంచైనా, పాత జాతీయ రహదారి వయా వై జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. గేటు మూసివేతతో నాలుగు రోజుల పాటు కేశంపేట రూట్‌కు వెళ్లివచ్చే వారికి ఇబ్బంది తప్పదు.

హక్కుల సాధనకు ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బర్క కృష్ణ

షాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ హక్కుల సాధనకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకం కావాలి బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మంగళవారం షాబాద్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ లందరు ఏకతాటిపైకి రావాలని, ఈ నెల 23న కుల సంఘాల జేఏసీ మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనచైతన్య సమితి రాష్ట్రా అధ్యక్షుడు మల్లేష్‌గౌతమ్, చౌక్కంపేట అంజనేయులు, బీసీ సేన మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, నాయకులు అజయ్‌కుమార్, చందు, జంగయ్య, శేఖర్, మల్లేష్, సత్యం, మహేష్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.వెయ్యి కోట్లతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు భట్టు కిషన్ రెడ్డి, నూదిని కొండల్‌రెడ్డి, బాస్కర్ రెడ్డి, యాట నర్సింహ, వెంకటేశ్, హన్మనాయక్, అంజన్‌రెడ్డి, గుర్రం కేశవులు,విజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన దండు శేఖర్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం ఆసుపత్రికి చేరుకొని శేఖర్‌ను పరామర్శించి రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



టెక్నికల్ క్లబ్ ప్రారంభోత్సవంలోఅధ్యాపకులు, విద్యార్థులు

అనురాగ్‌లో 'ఇన్నోవెక్స్' ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, 'ఇన్నోవెక్స్' వంటి క్లబ్‌లు నూతన ఆవిష్కరణలకు వేదికలవుతాయని టాస్క్ ప్రతినిధి జి.శేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన 'ఇన్నోవెక్స్' టెక్నికల్ క్లబ్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో పాటు కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్న క్లబ్‌లలో భాగస్వాములు కావాలని, దీంతో సాంకేతిక నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ బాబు, రమేష్‌బాబు, క్లబ్ అధ్యక్షుడు రవిరాజు, ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి అన్షుమాలిని, సభ్యులు రిషిక, సౌమ్య, జయలక్ష్మి, సాయిశ్రీజ, పవన్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఘట్‌కేసర్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పశువులకు విధిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఘట్‌కేసర్ పశువైద్యాధికారి పద్మిని అన్నారు. మంగళవారం యంనంపేట్‌లో 160 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పశువులు నీరసిస్తాయని, మేత మేయవని తెలిపారు. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, వ్యవసాయానికి వినియోగించే ఎడ్లు, దున్నలు సత్తువ కోల్పోతాయన్నారు. వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



గేదెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి పద్మిని

నిధుల్లేక.. పనులకు బ్రేక్

తుక్కుగూడలో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం



- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గ సభ్యులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, రైతులు

మహేశ్వరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో తుక్కుగూడలో చేపట్టిన సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని రూ.4.5 కోట్లతో చేపట్టింది. ఆ నిధులు సరిపోకపోవడంతో అదనంగా రూ.5.66 కోట్లు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపించారు. దీంతో నిర్మాణ వ్యయం మొత్తం రూ10.16 కోట్లకు చేరింది. పనులు చేపట్టిన శ్రీకో ప్రాజెక్టు సంస్థ రూ.3.30 కోట్లతో పనులు ప్రారంభించగా ఆసంస్థకు రూ.50 లక్షలే విడుదలయ్యాయి. మిగిలిన రూ.2.80 కోట్లు విడుదల చేస్తేనే పనులు చేస్తామని సంస్థ పనులకు బ్రేక్ వేసింది. ఫలితంగా రైతులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

పనుల ప్రారంభమెప్పుడో!

హైదరాబాదుతోపాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న తుక్కుగూడలో భారీ పరిశ్రమలు, బహుల అంతస్తుల నిర్మాణాలు, విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, బావర్చీ, పిస్తాహౌస్, మస్కతి వంటి పెద్దపెద్ద హోటళ్ల ఇక్కడ వెలుస్తున్నాయి కానీ, ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇక్కడి వారాంతపు సంతలో కోట్ల వ్యాపారం జరుగుతుంది. సంతకు వచ్చే ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండేలా సమీకృత మార్కెట్ యార్డు పనులను వెంటనే ప్రారంభించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. ఒక్క సంవత్సర కాలానికి వారంతపు సంత వేలంపాట రూ.2 కోట్ల వరకు పలికిందంటే ఈ మార్కెట్ యార్డు ఉపయోగం ప్రజలకు ఎంత అవసరమో తెలుస్తోంది.

మందుబాబులకు అడ్డాగా..

కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలకు మార్కెట్ వసతి కల్పించేందుకు చేపట్టిన మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభదశలో బాగానే జరిగినా తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు అంతస్తుల వరకు మార్కెట్ యార్డు పైకప్పు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రెండు సంవత్సరాలుగా పనులు చేయడం లేదు. గోల్కొండ కోటను తలపించేలా మార్కెట్ యార్డు నిర్మాణ పిల్లర్లు దర్శనిస్తున్నాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు భవనం అడ్డాగా మారింది. రాత్రిపూట మందుబాబులు పార్టీలు చేసుకుంటున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లతో మార్కెట్ యార్డు డపింగ్ యార్డులా తయారైంది. మున్సిపల్ పాలకవర్గం, ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదేని స్థానికులు ఆరోపిస్తున్నారు.



నిధులు విడుదల చేయించాలి

బీఆర్ఎస్ హయాంలో సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు కూడా ప్రారంభించారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆగిపోయిన పనులను కూడా ప్రారంభించడం లేదు. మార్కెట్ వసతి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆగిపోయిన మార్కెట్ యార్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి.

- రవినాయక్, మాజీ కౌన్సిలర్

నిధుల విడుదలకు కృషి చేస్తాం



తుక్కుగూడ మార్కెట్ యార్డు నిర్మాణానికి రావాల్సిన నిధులు సమయానికి రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. నిలిచిపోయిన సమీకృత మార్కెట్‌యార్డు నిర్మాణాన్ని పునఃప్రారంభించి పూర్తి చేయాల్సి ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. నిధులు విడుదలకు కృషి చేస్తాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

- వాణి, కమిషనర్, తుక్కుగూడ మున్సిపాలిటీ

గురుకుల పాఠశాల నుంచి

పారిపోయిన ఇద్దరు విద్యార్థినులు

- గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు
- చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగింత
- తల్లిదండ్రులకు సమాచారం
- ఘటనపై ఆరా తీసిన కలెక్టర్

వికారాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో ఉండడం ఇష్టం లేని ఇద్దరు విద్యార్థినులు గోడదూకి పారిపోయిన ఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శివారెడ్డిపేట శివారులోని ఓ గురుకుల పాఠశాలలో చదువుతున్న ధారూరు, షాబాద్ మండలాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అక్కడ ఉండడం ఇష్టంలేక బయటకు పోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 19న రాత్రి స్టడీ అవర్ ముగిసే వరకు వారిద్దరూ చదువుకున్నారు. రాత్రి అందరూ నిద్రపోయాక సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి గోడదూకి బయటకొచ్చారు. రాత్రి ఇద్దరు విద్యార్థినులు నడుచుకుంటూ వెళ్లడం చూసిన ఓ వ్యక్తి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెట్రోలింగ్ పోలీసులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టి ఇద్దరు విద్యార్థినులను గుర్తించారు. అదే రాత్రి వారిని బాలరక్షా భవన్‌కు తరలించి చైల్డ్ లైన్ అధికారులకు అప్పగించారు. కాగా, పాఠశాలలో ఉదయం హాజరు తీసుకునే సమయంలో ఇద్దరు విద్యార్థినులు లేని విషయాన్ని గుర్తించారు. అయితే అప్పటికే ఇద్దరు విద్యార్థినులు బాలరక్షా భవన్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ అక్కడికి చేరుకుని ఆరా తీయగా, ఆ ఇద్దరూ తమ బాలికలేనని గుర్తించారు. ఈ విషయాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులకు చేరవేశారు. సోమవారం వారొచ్చి బాలరక్షా భవన్ అధికారులను కలిసి తమ పిల్లలతో మాట్లాడారు. దీపావళి రోజు సెలవు ఉండడంతో విచారణ మంగళవారానికి వాయిదా వేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటేష్ ఆ ఇద్దరు విద్యార్థినులతో, తల్లిదండ్రులతో వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థినుల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ఉండడం ఇష్టం లేదని విద్యార్థినులు చెప్పడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. ఇదిలా ఉంటే, గురుకుల పాఠశాల నుంచి రాత్రి వేళలో ఇద్దరు విద్యార్థినులు బయటకు పారిపోయిన ఉదంతంపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. రాత్రి వేళలో విద్యార్థినులు బయటకు వెళితే విధుల్లో ఉన్న వారు ఏమి చేస్తున్నారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

రోడ్ల విస్తరణతో మెరుగైన సౌకర్యాలు

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణతో గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండల పరిధిలోని అస్మత్‌పూర్-మంచాలరోడ్డు బీటీ విస్తరణతోపాటు వివిధ గ్రామాలకు చెందిన లింకురోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి చేరువలో ఉన్న మంచాల వెనుకబాటుకు గురైందన్నారు. ఇక్కడ ఉపాధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి విడతలవారీగా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోళ్ల జగన్, మంతని శివ, మార సురేష్, ప్రేమాకర్‌రెడ్డి, మంతని వెంకటేష్, లింగస్వామి, మంతని గణేష్, మంతని బాలు, మాదం సుందర్, గాలయ్య, పుట్ట మల్లేష్, పాండాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఏటీఎం చోరీ నిందితుడి అరెస్ట్

● వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి

ఆదిభట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేయడం రాని వ్యక్తులు, సీనియర్ సిటిజన్లను టార్గెట్ చేసి ఏటీఎం నుంచి డబ్బులు దొంగిలించిన నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రవికుమార్ వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా తాళ్లగడ్డకు చెందిన సుధనబోయిన వెంకటేష్(37), మేడ్చల్‌లోని కీసర ఇస్మాయిల్‌గూడలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో నాలుగేళ్లుగా ఏంటీఎంల వద్ద దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేయరాని వ్యక్తులు, సీనియర్ సిటిజన్స్‌ను టార్గెట్ చేసుకొని వారికి డబ్బులు డ్రా చేయిస్తానని నమ్మించి వారి వద్ద ఒరిజినల్ ఏటీఎం కార్డు తీసుకొని దృష్టి మళ్లించి అతని వద్ద ఉన్న డూప్లికేట్ ఏటీఎం కార్డును మిషన్‌లో పెట్టి పిన్ నంబరు అడిగి ఆపరేట్ చేస్తాడు. తీరా డబ్బులు రావడం లేదని చెప్పి డూప్లికేట్ ఏటీఎం కార్డును వారికి ఇచ్చి ఒరిజినల్‌ను దొంగలిస్తాడు. ఆ కార్డుతో మరో చోట డబ్బులు డ్రా చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 11న తుర్కయాజంల్ పరిధిలోని ఎస్‌బీఐ వద్దకు డబ్బుల కోసం వచ్చిన ఓ వ్యక్తిని టార్గెట్ చేసి ఏటీఎంను దొంగిలించి రూ. 40 వేలు డ్రా చేసుకున్నాడు. బాధితుడు సాయినాథ్ మోహన్‌రావు 15న ఆదిభట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఆదిభట్ల పోలీసులు యంజాల్ ఏటీఎం వద్ద నిఘా పెట్టారు. సోమవారం ఎస్‌బీఐ ఏటీఎం వద్ద అతడు కనిపించడంతో ఆదిభట్ల క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని విచారించి అతని నుంచి రూ.6.31 లక్షల నగదు, సెల్ ఫోన్, బ్రిజా కారు. 23 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం చోరీ కేసును ఛేదించిన క్రైమ్ ఎస్సై నోయెల్ రాజ్, రవికుమార్, కిరణ్ రెడ్డి, ఎల్లయ్య, ఉపేందర్ రెడ్డి, సందీప్, శివ చంద్ర, సంతోష్, పూజితను డీసీపీ, ఏసీపీ అభినందించారు.



మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఎస్బీఐ అదనపు బ్రాంచిని ఏర్పాటు చేయాలి

దోమ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా మండలంలో ఎస్బీఐ అదనపు బ్రాంచిని ఏర్పాటు చేయాలని ఎస్బీఐ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ నితిన్‌ను సర్పంచ్‌ల సంఘం దోమ మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. మంగళవారం దోమ బ్రాంచిని సందర్శించిన నితిన్‌ను ఆయన కలిసి ఖాతాదారుల ఇబ్బందులపై వివరించారు. మండలంలో ఒకే బ్రాంచి తో సర్వీస్ ఏరియా ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మేనేజర్ మాట్లాడుతూ.. మండలంలో 12సీఎస్‌పీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని, నూతన బ్రాంచ్ ఏర్పాటనేది ఇక్కడ జరిగే లావాదేవీలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.



మేనేజర్‌కు విన్నవిస్తున్న రాజిరెడ్డి



నివాళులర్పిస్తున్న డీఎస్పీ, ఎస్సైలు

పోలీస్ అమర వీరులకు నివాళి

పరిగి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ భద్రతకోసం ప్రాణాలర్పించిన వీర జవాన్‌లను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం సుల్తాన్‌పూర్ స్టేజి వద్ద ఉన్న బలిమెరలో అమరుడైన విజయ్‌భాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐ మాట్లాడుతూ.. వీరజవాన్‌ల సాంత్వన కల్గించేలా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన కృష్ణ, ఏఎస్ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

సొమ్మసిల్లిన వ్యక్తి ఆచూకీ లభ్యం

కేశంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైరల్‌గా మారిన సొమ్మసిల్లి పడిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మంగళవారం కేశంపేట మండలం సంతాపూర్‌లో శివారు నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, గ్రామ యువకులు వ్యక్తి ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే 108లో కేశంపేట పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ పోస్ట్ వైరల్‌గా మారడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం సీతారామపురం గ్రామానికి చెందిన కాళ్ల బాలస్వామి(65)గా గుర్తించారు. ఎనిమిది నెలల కింద ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలస్వామి సోదరుడు లోకేష్ తన అన్నను ఇంటికి తీసుకెళ్తామని తెలిపాడు. బాలిస్వామి భార్య పదేళ్ల క్రితం మృతిచెందగా, వారికి ఇద్దరు కూతుళ్లు ఉండగా వారికి వివాహం అయ్యింది. ఓ కుమారుడు ఉండగా ఇంటర్ చదువుతున్నాడు.

ఎంపీ నిధులతో గ్రామాల అభివృద్ధి

పరిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని బీజేపీ బీసీసెల్ మండల అధ్యక్షుడు టీవీ నర్సింహులు అన్నారు. సయ్యద్‌పల్లిలో రూ.5లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో సీసీ, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి


భవిత కేంద్రంలో సేవలను పరిశీలిస్తున్న ఎంఈవో గోపాల్

పరిగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భవితే విద్యకు తొలిమెట్టని ఎంఈవో గోపాల్ అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరిగిలోని భవిత కేంద్రంలో కొనసాగుతున్న సేవలను పరిశీలించారు. కార్డులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న ఫిజియోథెరపీ, ప్రత్యేక విద్యాబోధన, క్రీడల నిర్వహణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఫిజియోథెరపి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ శివప్రసాదరెడ్డి, ఐఈఆర్పీ జ్యోతి పాల్గొన్నారు.

తండాలో వీధిలైట్ల ఏర్పాటు

బషీరాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జమ్లానాయక్‌తండాలో వీధిలైట్ల సమస్య తీరింది. తండాలో వీధిలైట్లు లేక కొంత కాలంగా గిరిజనులు అంధకారంలో మగ్గుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి దశరథ్ దృష్టికి తీసుకెళ్లినా నిధులు లేక లైట్లు వేయించలేదు. ఈ క్రమంలో దీపావళి పండగకు వీధిలైట్లు వేయించాలని కార్యదర్శి తండానాయకుడు జయరాంరాథోడ్‌ను కోరారు. నిధులు వచ్చాక బిల్లు డబ్బులు ఇస్తామని తెలిపారు. దీంతో సోమవారం జయరాం, శంకర్ వీధి లైట్లు వేయించారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం


విద్యార్థినులకు నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న రాజుగౌడ్

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని యువజన సంఘాల నాయకుడు పల్లె రాజు గౌడ్ అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని కోరారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థినులకు నోట్‌బుక్కులు, వాటర్‌బాటిల్స్, పరీక్ష ప్యాడ్స్‌లను అందజేశారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి జీవితానికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు, సాయి, లోకేశ్, భరత్, మల్లేశ్, జహంగీర్, మున్నా తదితరులు ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

షాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేన్లపై హైకోర్టు స్టే విధించడంతో షాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారిని పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా బీసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షకు ఉద్యమకారుడు దేశమోళ్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, చేవెళ్ల స్వామి, నర్సింహులు, రాము, రాజు, దర్శన్, నరహరిచారి, శ్రీనివాస్‌చారి, మధుసూదన్‌చారి, కరుణాకర్‌చారి, చంద్రయ్య, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

విద్యతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో గౌరవం, ఉన్నత జీవితం లభిస్తుందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానుగుల దశరథం అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకుడు పెరికేటీ యాదయ్యసుజాత దంపతుల కూతురు సాయిదీపిక మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్‌కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఆమనగల్లులో అభినందన సభ నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు గణేశ్, పట్టణ అధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కానుగుల దశరథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయిదీపిక, ఆమె తల్లిదండ్రులు సుజాత యాదయ్యను సంఘం నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గుద్దేటి బాలు, నాగేశ్, కోటి ఉన్నారు.


సాయిదీపికను సత్కరిస్తున్న కానుగుల దశరథం, నాయకులు

ఆలయ భూమిని హోల్డ్‌లో పెట్టండి

మాడ్గుల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత బ్రాహ్మణపల్లిలోని హనుమాన్ ఆలయం కింద గ్రామంలోని 215 సర్వే నంబర్‌లో 6.18 ఎకరాల భూమి ఉంది. ఏటా ఈ భూమిని కౌలుకు ఇచ్చేవారు. దాని మీద వచ్చే కౌలు డబ్బులను దేవాలయ ఖర్చులకు జమ చేస్తారని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ భూమిని గత ప్రభుత్వం నిషేధిత జాబితాల్లో చేర్చింది. గతంలో అప్పయ్య పేరుతో 12 ఎకరాల భూమి ఉంది. అందులోనుంచి దాదాపు ఆరెకరాలు అమ్మగా, మిగతా 6.15 ఎకరాలు ఆలయం ఆదీనంలో ఉంది. 2023లో ధరణిలో శ్రీనివాస్ అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేయించుకున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా ఈ భూమిని ఇటీవల అమ్మే ప్రయత్నం చేశాడని చెప్పారు. ఈ మేరకు గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని సంబంధిత భూమిని హోల్డ్‌లో పెట్టాలని తహసీల్దార్ వినయసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగల్‌విండో డైరెక్టర్ రమేష్ గౌడ్, నారకట్ల వెంకటయ్య, జెల్ల వెంకటయ్య, కొండల్ పాల్గొన్నారు.


ఆలయ భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

కీసరగుట్టలో ఈ సారైనా..!


కీసరగుట్ట ఆలయం

భక్తులకు ఇబ్బందులు తప్పేనా?

- స్థానికుల తీరుతో ఇక్కట్లు
- వీఐపీ దర్శనాలతో భక్తుల ఆందోళన
- ప్రతీ కార్తీకమాసంలోనూ ఇదే తీరు
- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- నెల రోజుల పాటు విచ్చేయనున్న భక్తులు


కీసర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీ హిందువు పవిత్రంగా భావించే మాసం కార్తీకం. కార్తీకంలో శివుడికి పూజలు, అభిషేకాలు చేస్తే పుణ్యం అని భక్తుల నమ్మకం. ప్రముఖ కీసరగుట్ట రామలింగేశ్వరాలయానికి ప్రతీ కార్తీక మాసంలో ఉపావాస దీక్షలతో వచ్చే భక్తులకు సౌకర్యాలు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ తీరు, స్థానికుల అధికార దుర్వినియోగంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శని, ఆది, సోమ, పర్వదినాలు, కార్తీకపౌర్ణమి సమయాల్లో కీసరగుట్ట రామలింగేశ్వరాలయానికి వచ్చే భక్తులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాస పూజల నుంచైనా భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారిస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసుల పెత్తనం

నెల రోజులు కీసరగుట్టలో జరిగే కార్తీక మాసోత్సవాల్లో పోలీసులు పెత్తనం చేస్తారు. కీసర పోలీస్ స్టేషన్ ఉన్నా పెత్తనం మాత్రం ఇతర ప్రాంతాల అధికారులదే. పోలీసు శాఖ అధికారులకు ఇక్కడ దర్శనం రాచమార్గం ద్వారా కల్పిస్తున్నారు. వాహనం గుట్ట వద్దకు రావడం మొదలు స్వామి వారి సన్నిధి చేరే వరకు వారిని అడ్డుకునే వారుండరు. దర్శనానికి అపసవ్య దిశగా(ఎగ్జిట్) నుంచి వెళ్లి దర్శించుకోవడంతో అభిషేక టికెట్లు కొన్న భక్తులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. పైగా వీఐపీగా వచ్చే వారికి ఏ ఒక్క చార్జీ ఉండదు. అన్నీ పుణ్యానికే. డబ్బులు వెచ్చించే భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా నెల రోజులు పోలీసు శాఖ వారు ఎంతమందొస్తారో లెక్క తీస్తే ఆ మేరకు ఆలయ ఆదాయం ఎంతగా పోతుందో అంచనా వేయొచ్చు. అలాగే తమ దర్పాన్ని చూపించుకునేందుకు కూడా కొందరు ఆలయానికి వస్తారనే విమర్శలు వస్తున్నాయి. దర్శన, సేవా టికెట్లు కొనకుండా ఫౌండర్ సభ్యులను పట్టుకొని, ట్రస్ట్ బోర్డు మెంబర్ల పేరు చెప్పి, ప్రజాప్రతినిధులమనో.. నాయకులమనో.. మేం లోకల్.. మాకు ఇజ్జత్ ఇవ్వరా? అని బెదిరిస్తూ స్వామివారి సన్నిధి చేరుకునే వారు వందల్లో ఉంటారు. వీరికి ప్రసాదంతో పాటు అన్నీ ఫ్రీనే. టికెట్లు కొన్న భక్తుల కేమో ఆలస్యం తప్పదు. దీంతో వారికి బేజారొచ్చి గొడవకు దిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

అధికార దుర్వినియోగం

వివిధ శాఖల అధికారులు కూడా స్వామి వారి వద్ద అధికార దుర్వినియోగానికి పాల్పడుతారు. రెవెన్యూ, విద్యుత్, కలెక్టరేట్ ఇలా వివిధ శాఖల అధికారులు నేరుగా దర్శనానికి వెళ్తుంటారు. ఎండోమెంట్ ఉద్యోగులు ఇలా పలు విభాగాల వారు దర్శనానికి నానా రభస చేస్తారు. నిజానికి నెల మొత్తంలో అభిషేకాలకు ఎన్ని టికెట్లు విక్రయిస్తారో.. అంతకంటే రెట్టింపు సంఖ్యలో ఉచిత అభిషేకాలు, అర్చనలు చేయిస్తుండడం గమనార్హం.. అలాగే ప్రసాదాలు, ఆశీర్వచనాల శాలువాలు ఇలా ఆలయ ఆదాయానికి భారీ గండి పడుతుంది. కొన్నేళ్లుగా ఫ్రీ అభిషేకాలతో గుట్ట ఆదాయం భారీగా తగ్గిపోయింది. అసలే శైవాలయాలకు ఆదాయం తక్కువ. కీలక సమయాల్లో ఇలా ఫ్రీగా వదిలేస్తుండడంతో ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు.


స్వామివారి దర్శనానికి లైన్లో భక్తులు(ఫైల్)

తీరు మారితేనే...

కార్తీకంలో ఫౌండర్, ట్రస్ట్ బోర్డు సభ్యుల తీరు మారాలి. వారు కూడా స్వామివారి సేవలో పాల్గొనాలి. ఇష్టానుసారం అభిషేకాలు, అర్చనలు చేసుకోకుండా ఉదయమే పూజలు ముగించుకొని భక్తులకు ఇబ్బంది కలగకుండా వ్యవహరించాలి. ఆలయంలో పెత్తనం చేయకుండా, అభివృద్ధికి పాటుపడాలి. కాగా కీసరగుట్ట ఆలయంలో ఎండోమెంట్ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈవోకు ఇతర ఆలయాల ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఇక్కడ విధుల నిర్వహణ సరిగా లేదు. కీసరగుట్ట కార్తీకంలో అభిషేకాలకు పెట్టింది పేరు. అలాంటి సమయంలో అధికారులు ఫ్రీగా అభిషేకాలు చేయించుకొని, ప్రసాదాలు తీసుకొని వెళ్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎప్పుడో ఏసీ రేంజ్‌కు వెళ్లాల్సిన కీసరగుట్ట ఆలయం అభివృద్ధి అంతంతే. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా అధికారులు నిర్లక్ష్యంతో కీసరగుట్ట ఆలయం అభివృద్ధి చెందడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సారైనా భక్తులకు ఇబ్బందులు తప్పేలా అధికారులు, కమిటీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కార్తీకం.. శుభకరం

నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం


నందివనపర్తిలో కొలువైన నందీశ్వరుడు

యాచారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నేటి నుంచి ప్రారంభం కానుండడంతో జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ఈనెల 22 నుంచి నవంబరు 21 వరకు కార్తీక మాసం కొనసాగుతుంది. వేడుకలకు శివాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. భక్తులు శివాలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. అందుకు తగ్గట్లు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి వేళ భక్తులు ఆలయాల వద్ద ఇళ్లల్లో భజనలు చేసి శివపార్వతులు, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. కార్తీక మాసం సందర్భంగా మాలలు ధరించడానికి భక్తులు సిద్ధమవుతున్నారు. ఈ మాసంలో శివునకు పూజలు చేస్తే పాప విముక్తులవుతారిని భక్తుల నమ్మకం.

ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

యాచారం మండలంలోని నందివనపర్తిలోని నందీశ్వరాలయం, సిద్దేశ్వరాలయం, శ్రీఓంకారేశ్వరాలయం, నల్లవెల్లిలోని గుట్టపై రామలింగేశ్వరస్వామి ఆలయం, గున్‌గల్ శివాలయంలో, తక్కళ్లపల్లిలోని గుట్టపై వెలిసిన మరకత శివునకు, శ్రీజ్ఞానసరస్వతీ ఆలయాల్లో భక్తులు రాత్రివేళ దీపాలంకరణ చేయడంతోపాటు భజనలు, కోలాటలు ఆడుతారు. చాలా మంది భక్తులు ఈ మాసంలో ప్రతి సోమవారం ఉపవాస దీక్ష చేపడతారు. నోములు, వ్రతాలు ఆచరిస్తారు. కార్తీక మాసంలో ఒక్కోరోజు ఒక్కో విశేషం ఉంటుంది. ఈ నెల మొత్తం పర్వదినాలే. తక్కళ్లపల్లి గుట్టపై వెలసిన మరకత శివుడికి అభిషేకాదులతోపాటు భక్తులకు నెల రోజుల పాటు అన్నదానం చేస్తారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి

మహేశ్వరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన అంకిత్(16) మహేశ్వరంలోని జేజే ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న రాజేంద్రనగర్ బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం అంకిత్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి గురుకుల పాఠశాలకు సమీపంలో ఉన్న కొత్వాల్ చెరువులో స్నానం చేయడానికి వెళ్లాడు. ముందుగా చెరువులోకి దిగిన అంకిత్‌కు ఈత రాకపోవడంతో చెరువులో మునిగి పోవడంతో తోటి విద్యార్థులు వెంటనే హాస్టల్‌కు వెళ్లి సిబ్బందికి, తోటి విద్యార్థులకు చెప్పారు. సిబ్బంది వెంటనే మహేశ్వరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వెంకటేశ్వర్లు చెరువు వద్దకు వెళ్లి బాలుడి ఆచూకీ కోసం చెరువును గాలించగా ఆదివారం అర్ధరాత్రి అంకిత్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దీపావళి రోజే కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కుమారుని మృతికి తోటి విద్యార్థులు, సంబంధిత హాస్టల్ సిబ్బందే కారణమని, వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలన్నారు. సంబందిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పాఠశాల ప్రిన్సిపాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నియకులు డిమాండ్ చేశారు.

సంపులో పడి చిన్నారి..


రక్షిత మృతదేహం

షాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంపులో పడి 18 నెలల చిన్నారి మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల మల్లేష్, స్వాతి దంపతులు. స్వాతి తన తల్లి సుగుణమ్మకు కూతురిని అప్పగించి గ్రామంలోనే కూలికి వెళ్లింది. అయితే ఇంటి పక్కన సుగుణమ్మ ఇల్లు కట్టుకుంటుండగా నీటి సంపును నిర్మించుకున్నారు. రక్షిత ఆడుకుంటూ వెళ్లి సంపులో పడిపోయింది. అదే గ్రామానికి చెందిన సత్తయ్య గమనించి రక్షితను సంపులో నుంచి బయటకు తీయగా అప్పటికే పాప మృతి చెందింది. నీటి సంపుపై కప్పును ఏర్పాటు చేయని సుగుణమ్మపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు లోబడి లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో మాదురి అన్నారు. నిర్మాణాలను బట్టి ప్రభుత్వం బిల్లులు అందిస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం సీతారామ్‌నగర్ తండా, కోనాపూర్ గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హా ఈ పథకంలో భాగంగా ప్రతి ప్రభుత్వ సంస్థకి, ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్ బోర్‌వెల్, రీచార్జ్ స్ట్రక్చర్స్, మ్యాజిక్స్ ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, వినద్, ఫీల్డ్ అసిస్టెంట్లు జైపాల్, ఈదమయ్య, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో కొందుర్గు నహీద్ ప్రతిభ

కొందుర్గు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని చంద్రా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన 22వ జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలలో కొందుర్గు మండల కేంద్రానికి చెందిన నహీద్ అండర్ 14 ఇయర్ అమ్మాయిల విభాగంలో తలబడి బంగారు పథకం సాధించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సన్మానించి ప్రశంస పత్రం, మెమోంటోను అందజేశారు. బంగారు పథకం సాధించిన నహీద్, కరాటే మాస్టర్ రమేష్‌ను అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీల అమలుపై గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. మంగళవారం ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో జైపాల్ యాదవ్ పర్యటించారు. పలు చోట్ల దీపావళి నోముల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు జైపాల్ యాదవ్‌కు స్వీట్లు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జైపాల్ యాదవ్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు పరిచి కాంగ్రెస్ బీసీల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం మొదలైందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంప వెంకటేశ్, లక్ష్మీనర్సింహారెడ్డి, పత్యనాయక్, శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌గౌడ్, సయ్యద్ ఖలీల్, గోపాల్, లచ్చిరామ్‌నాయక్, జోగు వీరయ్య, సైదులు గౌడ్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అయ్యప్ప ఆలయంలో అన్నదానం

శంకర్‌పల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నుంచి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శంకర్‌పల్లి అయ్యప్ప సేవాసమితి సభ్యులు తెలిపారు. కార్తీకమాస ప్రారంభం రోజు నుంచి డిసెంబరు 26 వరకు 66 రోజుల పాటు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అయ్యప్పస్వాములకు అన్నప్రసాదం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్నప్రసాదం చేయాలనుకున్న వారు రూ.31,000 అందించాలని అయ్యప్ప సేవా సమితి వారు కోరారు. మరిన్ని వివరాలకు ఆలయ కమిటీని సంప్రదించాలని సూచించారు.

ఆర్టీఐ మండల కార్యదర్శిగా చంద్రశేఖర్

కందుకూరు, అక్టోబరు 21(ఆధ్రజ్యోతి): మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన మద్దెల చంద్రశేఖర్‌ను సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు చట్టం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఫయాజ్ తెలిపారు. మంగళవారం కందుకూరు గ్రామంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాచార హక్కు చట్టంను మరింత బలోపేతం చేస్తూ.. ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

పోలీస్ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకొని పోలీసు సిబ్బందికి మంగళవారం మల్కాజ్‌గిరి ఏసీపీ ఎస్.చక్రపాణి హెల్మెట్లు పంపిణీ చేశారు. విధుల్లో బైక్‌పై వెళ్తతున్న పోలీసులు ఇద్దరికీ హెల్మెట్లు ఉండాలనే హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ రాజువర్మ, ఎస్సైలు నాగేశ్వర్‌రావు, శివకృష్ణ, కృష్ణయ్య, రాజు, విజయభాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు రూ.8,110

యాచారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవినాథ్ కోరారు. పత్తి ఏ గ్రేడ్ రకానికి క్వింటల్ రూ.8,110, బీ గ్రేడ్‌కు రూ.8,028.90, సీ గ్రేడ్ రూ.7,947.80 మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. కపాస్‌కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసి అందులో తెలిసిన వివరాల ప్రకారం విక్రయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదులకు 8897281111లో సంప్రదించాలని, అలాగే టోల్ ఫ్రీనంబర్ 180025995779ను సంప్రదించవచ్చని తెలిపారు.


శంషాబాద్ రూరల్: పూజలు చేస్తున్న పురాన్ కుటుంబ సభ్యులు


షాద్‌నగర్ అర్బన్: క్రాకర్స్ కాలుస్తున్న కుటుంబ సభ్యులు


చేవెళ్ల: క్రాకర్స్‌తో చిన్నారులు

వైభవంగా దీపావళి వేడుకలు

భక్తి శ్రద్ధలతో లక్ష్మీదేవి వ్రతాలు, పూజలు.. ఉత్సాహంగా బాణాసంచా పేల్చిన యువకులు, చిన్నారులు


యాచారం: బీసీ బాలికల హాస్టల్‌లో పోలీసుల సంబురాలు

జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. తమ జీవితాలలో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు నిండాలని వేడుకుంటూ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం, మంగళవారం నోములు, వ్రతాలు ఆచరించారు. ఇంటింటా దీపాలు వెలిగించి చిన్న, పెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహాలతో బాణసంచా పేల్చి సందడి చేశారు. పండుగ వేళ ఇళ్లల్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. టపాసులు, మిఠాయి దుకాణాలు కళకళలాడాయి. పలు చోట్ల నిర్వహించిన వేడుకల్లో ప్రముఖులు పాల్గొని ఉత్సాహం నింపారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 21


కడ్తాల్: వ్రతం ఆచరిస్తున్న అయిళ్ల పద్మ శ్రీశ్రీనివాస్‌గౌడ్ దంపతులు


కడ్తాల్: దీపావళి వేడుకల్లో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ


మాడ్గుల: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ మల్లు రవి


కొందుర్గు: వేడుకల్లో మహిళలు


కేశంపేట: వేములనర్వలో..

పొలాల్లో ఇసుక మేటలు!

(ఐదో పేజీ తరువాయి)

చేసిన రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వారికి పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదని, సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని లబోదిబోమంటున్నారు. కొందుర్గు మండలంలో చిన్నసన్న కారు రైతులు 7వేల ఎకరాల్లో పత్తి, 7,200 ఎకరాల్లో మొక్కజొన్న, 5,400 ఎకరాల్లో వరి సాగు చేశారు. అదేవిధంగా 21,400 ఎకరాలలో వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేశారు. ఇందులో అధిక శాతం పత్తి పంట చేతికందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల పత్తి పంట మురుగు దశకు చేరితే, మరికొన్నిచోట్ల నీరు చేరి ఎరుపుగా మారింది. ఆలస్యంగా సాగు చేసిన పత్తి పంట వేళ్లతో సహా పెకిలిపోయింది. దీంతో రైతుకు


వర్షపు నీటితో దెబ్బతిన్న పత్తి పంట

10శాతం పంట కూడా చేతికి వచ్చే అవకాశం లేదు. ఇసుక మేటలను తొలగించాలంటే మరింత ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడైన కూరగాయ పంటలు



అధిక వర్షాలకు కూరగాయ పంటలు పాడయ్యాయి. బీరకాయ, టమాట, వంకాయ, చిక్కుడు, బెండకాయ పూతకాయలు పట్టే సమయంలో అధిక వర్షాలకు నీరుబట్టి పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగించే చిన్నసన్న కారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- కావలి రాజేందర్, రైతు, ముట్పూర్

నష్ట నివేదికను పంపించాం



కొందుర్గు మండల పరిధిలోని లాలాపేట్ గ్రామానికి చెందిన రైతు ప్రశాంత్ రెడ్డి 14 ఎకరాలలో సాగు చేసిన పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించాం. పరిహారం వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తాం.

- సురేష్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, కొందుర్గు

ఎట్టకేలకు..!

(ఐదో పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందచేసేవి. కానీ గడిచిన పదేళ్ల కాలంగా రైతులకు రాయితీ పరికరాలను పంపిణీ చేయడం లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ వ్యవసాయ పరికరాలపై రైతులకు రాయితీ దక్కలేదు. అయితే ఎట్టకేలకు ఇపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లీ వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలని నిర్ణయించాయి. ఇందుకోసం జిల్లాకు రూ. 3.71 కోట్లు నిధులు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 4,313మంది రైతులకు వ్యవసాయ పరికరాలు రాయితీపై అందించనున్నారు. వాస్తవానికి గత పదేళ్ల కిందట యంత్ర లక్ష్మీ పేరుతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేసింది. రైతులకు రాయితీపై ఇచ్చే ఇతర యంత్ర పరికరాల పంపిణీని నిలిపివేసి పథకం కింద విడుదలయ్యే మొత్తం సొమ్ము ట్రాక్టర్ల పంపిణీకే కేటాయించింది. దీంతో పెద్ద రైతులకు మాత్రమే మేలు జరిగింది. చిన్న, సన్నకారు రైతులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదు. అయితే తరువాత కాలంలో దీనికి సంబంధించిన సబ్సిడీని అప్పటి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో స్కీమ్ ఆగిపోయింది. ఇలా దాదాపు 10 ఏళ్ల నుంచి రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాల పంపిణీ నిలిచిపోయింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం రైతుల కోసం స్మామ్ (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) పథకాన్ని అమల్లోకి తెచ్చింది. వ్యవసాయ ఉత్పాదకాలు, యంత్రాలకు రాయితీ కల్పించే ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసింది. దీని ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో రైతులకు వ్యవసాయ యంత్రాలు, పరికరాల పంపిణీ చేస్తారు. దీంతో మళ్లీ రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పంపిణీ కానున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాల పంపిణీకి నిధులు కేటాయించారు. ట్రాక్టర్లను మినహాయించి చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే పరికరాలను ఎంపిక చేసి వాటికి రాయితీ ప్రకటించింది.

రాయితీ పరికరాలు ఇవే

రోటోవేటర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, కల్టివేటర్లు, పవర్ టిల్లర్, మేజ్ షెల్లర్స్ దమ్ము యంత్రాలు, వరిగడ్డి మోపు కట్టే యంత్రాలు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లు, రోటో పడ్లర్, బండ్ ఫార్మర్, పవర్ స్ప్రేయర్లకు రాయితీ అందిస్తున్నారు.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా రక్షణ, కర్తవ్య నిర్వాహణలో ప్రాణాలొడ్డిన పోలీసు అమర వీరులను ప్రజలు ఎప్పటికి మరువరని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఎదుట దివంగత ఎస్ఐ కాసం హన్మంత్ రెడ్డి విగ్రహానికి సీఐ జానకీరాంరెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, శేఖర్, పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ హనుమంతరావు, సిబ్బంది మహేశ్, శ్రీనివాస్, జాషువా, శ్రీనివాసులు, రమేశ్, కవిత, పద్మ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దివంగత కానిస్టేబుల్ ఫహిముద్దీన్ చిత్రపటానికి ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కడ్తాల పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐ గంగాధర్, ఎస్ఐ ప్రసాద్ పోలీసు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఇబ్రహీంపట్నం: నివాళులర్పిస్తున్న పోలీస్ సిబ్బంది


యాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు పోలీసులు

యాచారం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని యాచారం సీఐ ఏ.నందీశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ కోరారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సిబ్బందితో కలిసి పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. యాచారంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు మధు, ప్రియాంక, సత్యనారాయణ, సైదులు, వంశి పాల్గొన్నారు.

కందుకూరు: హైదరాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కందుకూరు పోలీస్టేషన్ సిబ్బంది రక్తదానం చేశారు. రాచకొండ పోలీసు కమిషనర్ సుదీర్‌బాబు నేతృత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కందుకూరు సీఐ సీతారం, ఎస్ఐ మహేందర్‌తోపాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డితోపాటు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను స్మరించుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బీఆర్ఆర్ ఫౌండేసన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 130 మంది కార్మికులకు దుస్తులు అందజేశారు. కార్మికులకు ప్రభుత్వం వేతనాలు పెంచాలన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, మొద్దు వెంకట్‌రెడ్డి, క్యామ శంకర్, చిలుకల యాదగిరి, రాజ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు బూడిద నర్సింహారెడ్డి, మడుపు గోపాల్ తదితరులున్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న బూడిద రామ్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కంచాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో మిషన్ భగీరథ సరఫరా చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కిరణ్, వర్కాల వంశీ, అరుణ్, చత్రపతి తదితరులు ఉన్నారు.


చెక్కులు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

తలకొండపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదవలకు వరంలాంటిదని ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. జుహేదబేగంకు రూ.60 వేలు, లక్ష్మీదేవమ్మకు రూ.24,500, రామస్వామి గౌడ్‌కు రూ.24,500 మంజూరు కాగా వెల్జాల గ్రామంలో నాయకులతో కలిసి వారికి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, అజీజ్, కృష్ణయ్యగౌడ్, లంగం యాదవ్, ఎండీ జాఫర్, మల్లేశ్, కిరణ్‌కుమార్‌గౌడ్, లక్ష్మణ్, విష్ణు, ఇస్మాయిల్, ఆంజనేయులు, పాండు యాదవ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తలకొండపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. యాదయ్య మృతదేహాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మంగళవారం సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలు బాధిత కుటుంబానికి నాయకులు అందజేశారు. నాయకులు విజయ్‌కుమార్, చందు, కుమార్, రాములు, రమేశ్ ఉన్నారు. అలాగే వెల్జాల గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు చెన్నకిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. చెన్నకిష్టయ్య మృతదేహాన్ని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయం సమకూర్చగా నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, నాయకులు యాదయ్య, పెంటయ్యగౌడ్, శ్రీకాంత్ యాదవ్, ప్రకాశ్‌గౌడ్, చెన్నకేశవులు, రవి, కుమార్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఆమనగల్లు పట్టణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. డీకేపీఎస్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో పది టీంలు పాల్గొన్నాయి. హిట్టర్స్ టీం విన్నర్‌గా, జీజీ గ్లాడియేటర్స్ టీం రన్నర్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లకు డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు శంకర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు గోరటి దేవేందర్, రాజు, మహేందర్, రమేశ్, రంజిత్, వరికుప్పల రాజు, ప్రసాద్, నర్సింహ, రామకృష్ణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న శంకర్

ఆది గురు పీఠానికి భూ దానం

కందుకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆది గురు పీఠానికి మండలంలోని బైరాగిగూడ గ్రామానికి చెందిన అందుగుల సత్యనారాయణ భూదానం చేశాడు. తన పూర్వీకుల నుంచి వచ్చిన భూమిలో లేమూరు సర్వే నంబర్ 465లో 1,100 గజాల స్థలాన్ని ఆది పీఠంకు దానం చేశారు. ఈ భూమికి మార్కెట్ విలువ గజానికి రూ.20 వేలకుపైనే ఉంది. మాదిగల పెద్దలు బోసుపల్లి ప్రతాప్, శివగల్ల యాదయ్య, పుట్టగల్ల జగన్ సత్యనారాయణతో కలిసి సోమవారం భవన నిర్మానానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కుల పెద్దలు సుందరయ్య, మహేందర్, జశ్వంత్, సాయిబాబ, రమేష్, బాబురావు, సుందరయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు కాంగ్రెస్ నేతల మరమ్మతులు

కేశంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంటపల్లి - కొండారెడ్డిపల్లి రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అఫ్జల్‌గంజ్ నుంచి చింతకుంటపల్లి గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసు నిలిచిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గుర్తించిన కాంగ్రెస్ నాయకులు అల్లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్ యాదవ్ మంగళవారం సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్‌తో గుంతలు పూడ్చివేయించారు. గ్రామస్తులు వారిని అభినందించారు. కార్యక్రమంలో రాజు, మల్లేష్, లింగం యాదవ్, జంగయ్య పల్లెమోని పాండు, సూజీవన్ రెడ్డి, శ్రీను యాదవ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి


ప్రసాదరావు(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన షాద్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. షాబాద్ మండలం కక్కులూరు గ్రామానికి చెందిన ప్రసాదరావు(64) మూడేళ్లుగా అల్జీమర్స్‌తో బాధ పడుతున్నాడు. మతి స్థిమితం సరిగా లేక తిరుగుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గతంలోనే మృతి చెందగా కుమారుడు భానుచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత..


వెంకటయ్య(ఫైల్)

ఆమనగల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆమనగల్లు పట్టణంలోని నవ చైతన్య కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొమ్ము వెంకటయ్య(48)మృతి చెందాడు. ఈనెల 16న మాడ్గుల మండల కేంద్రం సమీపంలో బైక్‌పై నుంచి పడడంతో వెంకటయ్యకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వెంకటయ్య మృతి పట్ల ప్రజా సంఘాల నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ సంతాపం తెలిపారు.

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం



కేశంపేట, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట పంచాయతీ పొడగుట్ట తండాలో మంగళవారం చోటుచేసుకుంది. కేతావత్ లలిత భర్తన కోల్పోవడంతో పుట్టింటికి వచ్చి అన్న ప్రకాష్ వద్ద ఉంటోంది. ఈనెల 19న ఇద్దరు పిల్లలు అమిత్ పటేల్, అంసినిని తీసుకుని ఎక్లాస్‌ఖాన్‌పేటకు వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఐదు అడుగుల ఎత్తు చామనఛాయ కలిగిన లలిత ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో బ్రౌన్ కలర్ చీర ధరించి ఉంది. చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం లలిత అన్న ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

కొందుర్గులో వివాహిత..

కొందుర్గు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రవీందర్ నాయక్ ప్రకారం.. కొందుర్గు గ్రామానికి చెందిన భారతమ్మ కుమార్తె బంటు సరితను పదిహేనేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా దారూర్ మండలం చిన్నమోముల గ్రామానికి చెందిన బంటు ఆనంద్‌తో వివాహం జరిపించారు. మూడు సంవత్సరాల నుంచి కూతురు అల్లుడు కొందుర్గులో నివాసం ఉంటున్నారు. ఈనెల 10న మధ్యాహ్నం గ్రామంలో జరిగే సంతలో కూరగాయలు తీసుకువస్తానని వెళ్లిన సరిత తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకి లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మెరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైకును ఢీకొన్న కారు.. బాలుడికి గాయాలు

కొందుర్గు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి షాద్‌నగర్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు స్కూటీని ఢీకొట్టడడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొందుర్గు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గులో నివాసం ఉంటున్న ప్రజాపత్ ప్రభురామ్ తన కుమారుడు హిమాన్షుతో రోడ్డు పక్కన స్కూటీపై ఆగి ఉన్నారు. అంతలోనే కారు అతివేగంగా వచ్చి వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైన హిమాన్షును హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించగా తండ్రి షాద్‌నగర్‌లో చికిత్స పొందుతున్నాడు. అతివేగంగా కార్ డ్రైవ్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీ

కొందుర్గు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొందుర్గు మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు గ్రామానికి చెందిన శ్రీశైలం(38), చిన్నయ్య(34) కొందుర్గు నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో టీవీఎస్ లూనాను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. గుర్తించిన స్థానికులు గాయాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు పోలీసులు తెలిపారు.

మంజీరా నదిలో వ్యక్తి గల్లంతు

పుల్‌కల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో అస్తికలు కలిపేందుకు వచ్చిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన సింగూరు ప్రాజెక్టు వద్ద సోమవారం జరిగింది. పుల్కల్ ఎస్ఐ ఎన్.విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మిర్జాగూడ గ్రామానికి చెందిన సూరజ్‌సింగ్(52) బంధువు అస్తికలను మంజీర నదిలో కలిపేందుకు కుటుంబ సభ్యులు, బంధువులతో సింగూరుకు వచ్చాడు. అస్తికలు కలిపిన అనంతరం స్నానం చేసేందుకని నదిలోకి దిగాడు. జలాశయం బ్యాక్ వాటర్ విస్తరించడంతో నదిలో నీటి నిల్వలున్నాయి. నీటిలోకి దిగిన సూరజ్‌సింగ్ ఊపిరాడక గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న వారు ఎంత వెతికిని అతడి జాడ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎన్.విశ్వజన్ ఘటనా స్థలానికి చేరుకున్నాడు. అతడి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకార్మికుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. సూరజ్‌సింగ్ గల్లంతై రెండు రోజులు గడిచినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా ముగిసిన వాలీబాల్ పోటీలు

కడ్తాల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన వాలీబాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. టోర్నమెంట్‌లో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పది జట్లు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమానికి సీఐ గంగాధర్, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ ప్రతినిధి లక్ష్మణస్వామి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి హాజరయ్యారు. సీఐ వరప్రసాద్, పీఈటీ భీముడు పర్యవేక్షణలో ఫైనల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. కడ్తాల్ మండల కేంద్రం జట్టు మొదటి బహుమతి, సాలార్‌పూర్ జట్టు రెండో బహుమతి, రావిచెడు జట్టు మూడో బహుమతిని గెలుచుకున్నాయి. విజేత జట్లకు సీఐ గంగాధర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేష్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందిస్తున్న సీఐ గంగాధర్